క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

వాజేడు: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కొడుకు వైద్యానికి సహకరించాలని మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామానికి చెందిన మోహన్‌రావు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలకు విలువ గల ఎల్‌ఓసీని క్యాంపు కార్యాలయంలో సోమవారం మోహన్‌రావుకు అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



వాజేడు: భద్రాచాల ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నాయకులు భద్రాచలం వెళ్లి ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా డెనార్జున్‌రావు

వాజేడు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బొల్లె డెనార్జున్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర నాయకుడు పొడెం వీరయ్య నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పార్టీ ఎదగడానికి ప్రతి నిత్యం కృషి చేయాలన్నారు.

గుండెపోటుతో పశువైద్యాధికారి మృతి


శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్‌రెడ్డి (36) గుండెపోటుతో సోమవారం హనుమకొండలో మృతి చెందాడు. మల్లంపల్లి పశువైద్యాధికారిగా ఆరేళ్లుగా క్లస్టర్ పరిధిలో పశువైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలుపొందారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురై సెలవుల్లో ఉన్నారు.

బైండోవర్

ఏటూరునాగారం: గుడుంబా నియంత్రణలో భాగంగా ఏటూరునాగారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం(కె) మండలాలకు చెందిన గుడుంబా తయారీ, విక్రయదారులను సోమవారం ఆయా మండలాల తహసీల్దార్‌ల వద్ద బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. వెంకటాపురం(కె) మండలంలోని మెర్రవానిగూడెం, పాత్రాపురం, వెంకటాపురం, బెస్తగూడెం, మంగపేట మండలంలోని కోమటిపల్లి, చుంచుపల్లి, రాజుపేట, బోరునర్సాపురం, ఏటూరునాగారం మండలంలోని ముళ్లకట్ట గ్రామాలకు చెందిన 15 మంది గుడుంబా తయారీ, విక్రయదారులను ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. వారు ఇక నుంచి గుడుంబా తయారీ చేసినా, అమ్మినా బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు శిక్ష, రూ. 2లక్షల జరిమానా ఉంటుందన్నారు. ఎక్సైజ్ కానిస్టేబుల్స్ నవీన్, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించాలి

ములుగు రూరల్: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ముందుకు సాగాలని ములుగు ఏరియా ఆస్పత్రి వైద్యురాలు నమ్రత సూచించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించినప్పుడే విజయం సాధ్యమవుతుందని అన్నారు. మానసికంగా, శారీరకంగా ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత శిఖ రాలను చేరుకోవచ్చన్నారు. పరీక్షల ముందు విద్యార్థుల భయాన్ని పోగొట్టేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రిన్సిపాల్ మల్లేషం అన్నారు. ఐక్యూసీ శ్రీకాంత్, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

దగ్ధమవుతున్న అడవులు

- నాలుగు రోజులుగా వ్యాపిస్తున్న మంటలు
- పట్టించుకోని అధికారులు


దగ్ధమవుతున్న మల్లూరుగుట్ట

మంగపేట: మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుకు అతి సమీపంలోని మల్లూరు నుంచి చుంచుపల్లి, రమణక్కపేట, రాజుపేట వరకు గల గుట్టల్లో కార్చిచ్చుతో అడవులు దాదాపు నాలుగు రోజులుగా దగ్ధమవుతున్నాయి. సోమవారం మంటలు విస్తృతంగా వ్యాపించాయి. అదే గుట్టకు మరో వైపున ఉన్న శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంతం నుంచి శనిగకుంట, పూరేడుపల్లి, వాగొడ్డుగూడెం వరకు గుట్టను మంటలు చుట్టూ ముట్టడంతో మంటలు ఎగిసిపడుతున్నాయి. మంటలకు సుమారు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలోని గుట్టపై గల లక్షలాది రూపాయల విలువైన అటవీ సంపద కాలి బూడిదవుతోంది. దీంతో మల్లూరుగుట్ట కింద ప్రాంతంలోని చింతామణి జలపాతం, దేవునికుంట, దబ్బతోగు, చుంచుపల్లి సమీపంలోని మామిడితోగు, రమణక్కపేట ఎర్రమ్మతోగు తదితర తోగుల్లో నీటి వసతి ఉండటంతో ఆయా అటవీ ప్రాంతాల్లో సంచరించే వన్యప్రాణులు అడవిలోని మంటల్లో చిక్కుని ఆహుతవుతున్నాయి. దగ్ధమవుతున్న అడవుల్లో మంటల వేడికి తాళలేక ప్రాణాలు దక్కించుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు చిక్కి బలవుతున్నాయి.

ఆయుర్వేద వృక్షసంపద కనుమరుగయ్యే ప్రమాదం

మానవాళికి ప్రాణవాయువును పంచే సహజ సిద్ధ అడవులు దగ్ధమవుతున్న పరిస్థితిని చూస్తుంటే ముందు రోజుల్లో అడవులు అంతరించే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా అడవుల్లో మంటల కారణంగా 'ఔషదాల పుట్ట మల్లూరుగుట్ట'గా ప్రసిద్ధిగాంచిన మల్లూరుగుట్టపై అరుదుగా లభించే వేలాది రకాల ఆయుర్వేద వనమూలికల వృక్ష జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.


రాజుపేట సమీపంలోని గుట్టపై దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం


చుంచుపల్లి సమీపంలో..

గ్రామాలను కమ్మేస్తున్న పొగ

అడవులు దగ్ధమవుతుండటంతో అటవీ సమీప గ్రామాలను పొగ కమ్మేస్తోంది. మండుతున్న ఎండలతో పాటు అడవుల్లో మంటల కారణంగా ఆయా అటవీ సమీప గ్రామాల ప్రజలు వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అడవిని రక్షించాల్సిన అటవీశాఖ అధికారులు కనీసం మంటలను అదుపు చేసే ప్రయత్నం కూడా చేయడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి అడవుల్లో మంటలను ఆర్పివేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో సిగ్నేచర్ మెమొరీ డే


విద్యార్థి టీషర్ట్‌పై సిగ్నేచర్ చేస్తున్న ప్రిన్సిపాల్ చిన్న

ఏటూరునాగారం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బీకాం విద్యార్థులు సిగ్నేచర్ మెమొరీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జై చిన్న మాట్లాడుతూ.. ఐఐటీ, ఎన్ఐటీ ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సిగ్నేచర్ మెమొరీ డేను ఈ కళాశాలలో మొదటిసారి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వారి వారి దుస్తులపై గుర్తు ఉండేలా సిగ్నేచర్ చేశారన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెచ్‌ఓడీ డాక్టర్ రేణుక మాట్లాడుతూ బీకాం విద్యార్థులు ప్రతిభను కనబర్చి నిత్య నూతనంగా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం ఘన్‌సింగ్, రమేష్ కుమార్, ఏఓఎం రుమారాణి, నవీన్, ఫాతిమా, వెంకటయ్య, జ్యోతి, సంగీత, సంపత్ సురేష్, రమేష్, మున్ని, విద్యార్థులు పాల్గొన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న సీసీఎఫ్


హేమాచలున్ని దర్శించుకుంటున్న ప్రభాకర్

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామిని కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొట్ట మొదటిసారిగా ఆలయానికి వచ్చిన సీసీఎఫ్ ప్రభాకర్‌కు పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు, శేఖర్‌శర్మ, అశ్వర్‌చంద్ రామానుజం మర్యాద పూర్వకంగా ఆలయంలోకి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని స్వయంభూ స్వామివారికి సీసీఎఫ్ ప్రభాకర్ కుటుంబ సభ్యులు గోత్ర నామాలతో ప్రత్యేక అర్చన చేసి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణాన్ని వివరించారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల శేష వస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట తాడ్వాయి రేంజ్ అధికారి సత్తయ్య, మంగపేట డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్, మల్లూరు బీట్ ఆఫీసర్ చంద విజయరావు ఉన్నారు.

చేపల మార్కెట్‌లో వ్యక్తిపై కత్తితో దాడి


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని చేపల మార్కెట్‌లో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేయడం జరిగింది. ఈ సంఘటన సోమవారం చోటు చేసకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం చేపల మార్కెట్‌లో చేపలు విక్రయించే నాగేంద్రప్రసాద్, వంశీల మధ్య చేపల విక్రయాల్లో మనస్పర్ధలు వచ్చాయి. దీంతో వంశీ కత్తితో నాగేంద్రప్రసాద్‌పై దాడి చేయడంతో ముఖంపై గాయాలయ్యాయి. గాయాలైన నాగేంద్రప్రసాద్‌ను ద్విచక్రవాహనంపై వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో వరంగల్ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై అశోక్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడి చేసిన వంశీని అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలోని గోదావరి ఇసుక పాయ నుంచి ఆదివారం రాత్రి పొక్లెయినర్ సాయంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చొక్కాల గోదావరి ఇసుక పాయ నుంచి ఇసుకను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో నాలుగు ఇసుక ట్రాక్టర్లు, పొక్లెయినర్‌ను స్వాధీనం చేసుకోని రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు.

సర్వర్ ఆశయాలను కొనసాగిస్తాం..


నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ములుగు రూరల్: పేదరిక నిర్మూలన, సమానత్వం కోసం ఉద్యమించి ప్రాణత్యాగం చేసిన ఎండీ.సర్వర్ ఆశయాలను కొనసాగిస్తామని సర్వర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు అన్నారు. మండలంలోని రాంచంద్రాపురంలో సర్వర్ వర్ధంతి సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యుడు రమేష్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి సర్వర్ అని కొనియాడారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో ములుగు ఏరియా ఆస్పత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొంతి రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి లక్ష్మారెడ్డి , ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో వైద్య సిబ్బంది

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా సీహెచ్‌సీలో సోమవారం వైఆర్‌జీకేర్ సంస్థ లింక్ వర్కర్ కిషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని అన్నారు. హెచ్ఐవీ నాలుగు మార్గాలుగా వస్తుందని తెలిపారు. సురక్షితం కానీ లైంగిక సంబంధాల వల్ల, కలుషితమైన సూదులు ఇంజక్షన్‌లా ద్వారా, పరీక్షించని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకి వస్తుందని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మధు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న గిరిజన యూనివర్సిటీకి భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలని మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్ అన్నారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి బాధితులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయి సంవత్సరాలు గడిచిన పరిహారం అందక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

'నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే రాద్ధాంతం సరికాదు'


మాట్లాడుతున్న రవియాదవ్

ములుగు రూరల్: ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ వృత్తిపరంగా నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే సామాజిక మాధ్యమాల్లో రాద్ధాంతం చేయడం సరికాదని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇంచర్లలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని జీవింతరావుపల్లికి కూలి పని కోసం వచ్చిన రవీందర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ మేరకు ఆస్పత్రికి తీసుకువెళితే డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో పాటు కనీసం పట్టించుకునే వారు లేరన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు సూపరింటెంటెట్‌కు సమాచారం అందించే ప్రయత్నం చేయగా కనీసం బాధ్యత లేకుండా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రిలో విధులు నిర్వర్తించడం కంటే సొంత ఆస్పత్రిలో పని చేసేందుకు మొగ్గు చూపుతూ నిరుపేదల ప్రాణాలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తప్పకుండా ప్రశ్నిస్తామని అన్నారు. విధుల్లో వైద్యులు లేరని అడిగితే ప్రతిపక్ష నాయకులతో కలిసి రాజకీయాలు చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్‌రెడ్డి, అధికార ప్రతినిధి కుమార్‌గౌడ్, రవికుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు బొంతల వేణుయాదవ్, సురేష్ పాల్గొన్నారు.

మాదిగలను అణచివేస్తున్న కాంగ్రెస్


ధర్నా చేస్తున్న మాదిగ సంఘాల నాయకులు

ఏటూరునాగారం: కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను రాజకీయంగా ఎదగకుండా అణచివేసే ప్రయత్నం చేస్తుందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులను ఓడిస్తామని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మడిపల్లి శ్యాంబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కరుణాకర్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గజ్జలప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో రహదారిపై బైఠాయించి సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 17 పార్లమెంటు స్థానాలు ఉండగా ఒక సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాలల పార్టీగా మారిందన్నారు. మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తుంది అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంపెల్లి శంకర్, ఆత్కూరి లక్ష్మణ్, మంగపేట మండల అధ్యక్షుడు ఏంపెల్లి మల్లేష్, సురేష్, జాషువా, రాజు, శ్రీరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన శ్యామల శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో కాళ్ల దెబ్బతిని నడువలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అతడికి ఆర్థిక సాయం అందించారు. సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కొంత నగదును అందించారు.

ఎండిపోతున్న రావి చెట్టు

- అరిష్టమంటూ గ్రామంలో పుకార్లు

వెంకటాపురం(ఎం): సకల దేవతలు కొలువై రావిచెట్టుపై ఉంటారని, రావిచెట్టును పూజిస్తే కష్టాలు తొలిగిపోయి జీవితం ఆనందమయంగా ఉంటుందనేది హిందువుల నమ్మకం. అలాంటి పవిత్రమైన రావిచెట్టుకు కష్టమొచ్చిందని మండల కేంద్ర ప్రజలు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. వెంకటాపురం(ఎం)లోని హనుమాన్ దేవాలయంలో సుమారు 60 ఏళ్ల క్రితం నుంచే రావిచెట్టు ఉంది. మండల కేంద్ర ప్రజలు రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం అంజనేయస్వామిని దర్శించుకునేవారు. ప్రతి ఏటా ఉగాది పండుగకు ముందే రావిచెట్టు ఆకు రాలిపోయి కొత్తగా చిగురించేది. ప్రతి ఏటా ఏప్రిల్ మాసంలో జరిగే శ్రీరామనవమి వేడుకలను సైతం చెట్టు నీడన అంగరంగ వైభవంగా జరిపించేవారు. కాని చెట్టుకు ఆకురాలి పోయి నెలరోజులు కావస్తున్నా కొత్తగా చిగురించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అరిష్టమంటూ గ్రామంలో ప్రచారం

అరవై ఏళ్ల చరిత్ర కలిగిన హనుమాన్ దేవాలయంలోని రావిచెట్టు ఎండిపోతుండడంతో గ్రామానికి అరిష్టం వచ్చిందంటూ గ్రామంలో పుకార్లు వినిపిస్తున్నాయి. రావిచెట్టు ఎండిపోవడానికి ఒక్కొక్క కారణాన్ని ఒక్కొక్కరూ వెల్లడిస్తున్నారు. గత రేండేళ్ల క్రితం ఆలయంలో సీసీ వేసినప్పుడు చెట్టు చుట్టూ సీసీ పోయడం వల్ల ఎండిపోయిందని, గతేడాది ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించే క్రమంలో గుంతలు తీస్తున్న క్రమంలో వచ్చిన చెట్టు వేర్లను నరికివేయడం వల్లనే చనిపోతుందని పేర్కొంటున్నారు. గతంలో వేపచెట్లకు వైరస్ సోకి చనిపోయినట్లుగానే రావిచెట్టుకు ఏదైనా వైరస్ సోకి ఉంటుందని మరికొందరూ అభిప్రాయ పడుతున్నారు.

కాపాడేందుకు ప్రయత్నం చేస్తున్నాం

గ్రామస్తులు 60 ఏళ్లుగా పూజిస్తున్నా రావిచెట్టు క్రమంగా ఎండిపోతుండడంతో చెట్టును రక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రతి ఏటా ఉగాది ముందు ఆకురాలి పోయి కొత్త ఇగురు వచ్చేది. ఆకు రాలిపోయి 25 రోజులు దాటినా ఇప్పటివరకు చిగురించలేదు. చెట్టు చుట్టూ తవ్వకాలు చేపట్టి ఉదయం, సాయంత్రం నీరు పోస్తూ చెట్టును బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నాం.

– నరెడ్ల భాస్కర్, ఆలయ కమిటీ చైర్మన్


హనుమాన్ దేవాలయంలో ఎండిపోతున్న రావిచెట్టు